క్లుప్తంగా

పారిజాతగిరిలో శ్రావణ నక్షత్ర కల్యాణోత్సవం



శ్రావణ నక్షత్ర కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణ నక్షత్రం పురస్కరించుకుని కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో 108 బంగారు పుష్పాలతో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రావణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయధారులుగా వెంకటేశ్వరరావు, వెంకట పద్మావతి కుటుంబసభ్యులు వ్యవహరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు గవరవరం విద్యార్థులు



కబడ్డీ పోటీకి ఎంపికైన కట్టం శ్రావణి



బ్యాడ్మింటన్ పోటీకి ఎంపికైన గొర్రె లాస్యశ్రీ

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు గవరవరం గ్రామానికి చెందిన వెంకటపతి రాజు విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి మంగళవారం పేర్కొన్నారు. ఏలూరులోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -19 కబడ్డీ పోటీల్లో శ్రావణి, బ్యాట్మింటన్ పోటీల్లో లాస్యశ్రీ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాజీ సర్పంచ్ నరసింహరాజు, ప్రిన్సిపాల్ నారా కేశవరావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను తెలుసుకోవాలి



బొర్రంపాలెం హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రదర్శన

టి.నరసాపురం: స్వాతంత్ర్య సాధనకు ఎందరో యోధులు పోరాడారని, వారి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బొర్రంపాలెం జెడ్పీహైస్కూల్ హెచ్ఎం మహ్మద్ ఆలీ అన్నారు. మన మట్టి–మనదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశానికి వివిధ రంగాల్లో సేవలు అందించిన మహనీయుల విశిష్టతలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. జాతీయ నాయకుల చిత్రపటాలతో స్వాతంత్రోద్యమ నాటి నినాదాలను విద్యార్థులతో వల్లె వేయిస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలి



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు మొక్కను అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ చిరంజీవి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నెర్సు చిరంజీవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు. ఏలూరు త్రీ టౌన్ పరిధిలో ఉన్న టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు చిరంజీవి తెలిపారు. మార్కెట్ యార్డ్ సమస్యలపై చర్చించామన్నారు. చిరంజీవి వెంట నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కాంచన రామకృష్ణ ఉన్నారు.

ఆనంద్‌కు జాషువా పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీఆర్వో పువ్వల ఆనంద్‌కు నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకొని జాషువా సాహితీ పురస్కారాన్ని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ మేరకు సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా యోనా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28న ఏలూరులో జరిగే జాషువా జయంతి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతులమీదుగా పురస్కారాన్ని అందించనున్నట్టు తెలిపారు. ఆనంద్ సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు వివరించారు.

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటుమేమయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రంలో గణేష్ నిమజ్జన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. స్థానిక ఆర్చిగేటు కూడలిలో, అలాగే వసంత్‌నగర్ కాలనీలో నెలకొల్పిన గణనాథులకు ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రంలో ఊరేగించారు. అయితే ఆర్చిగేటు సెంటర్‌లోని గణేషుని ఊరేగింపులో ఏర్పాటు చేసిన శక్తి వేషధారణలు, గరగ నృత్యాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, యువకుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్వామివారి వాహనానికి పచ్చిపూలతో చేసిన అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఊరేగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో గణేష్ విగ్రహాలను నిమజ్జన చేశారు. ఇదిలా ఉంటే ఆర్చిగేటు సెంటర్‌లోని గణనాథుని లడ్డూకి వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన మొయ్యా శివ రూ.10,116కు దక్కించుకున్నాడు. మరో చిన్న లడ్డూని త్రిమూర్తులు లాటరీలో కైవసం చేసుకున్నారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నెలకొల్పిన గణనాథుని లడ్డూని దొరసానిపాడు గ్రామానికి చెందిన బండిరెడ్డి కార్తికేయ లాటరీ ద్వారా పొందారు. ఇదిలా ఉంటే స్థానిక గుడిసెంటర్‌లో మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మంగళవారం గణేష్ ఉత్సవ శిబిరాల వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మిషనరీ హాస్పిటల్ వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమంలో స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. పరింపూడిలోని ఉప్పు రంగారావు వీధిలో సాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ నగర్‌లోని గణేష్ శిబిరం వద్ద మూడువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అంకాలగూడెం లక్ష్మీ గణనాథ, వైఎస్సార్ గణనాథుల ఊరేగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు.



కొయ్యలగూడెం మండలం పరింపూడిలో గణనాథుని ఊరేగింపు



ద్వారకాతిరుమలలో వినాయకుడి ఊరేగింపు

అఖండ అన్నసమారాధన

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం గ్రామంలో మంగళవారం అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో ముగింపు సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కృష్ణకుమారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. అలాగే గణనాథుడికి విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఎస్‌వీపీకేహెచ్ శ్రీనురాజు, విజయవాడ రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, కె.జగ్గవరం సహకార సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, దాసరి రాంబాబు, యర్రా గంగాధరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: విజయదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రులలో భాగంగా మంగళవారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. దేవాలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, నాయకులు రాజాన సత్యనారాయణ, పీవీ రామలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని అన్నసమారాధను ప్రారంభించారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద స్వయంభూ వరసిద్ధి వినాయక, అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.



టి.నరసాపురం మండలం కె.జగ్గవరంలో గణనాథుడికి పూజలు



కొయ్యలగూడెంలో ఊరేగింపులో నవ కాళికా వేషధారణలు



ద్వారకాతిరుమల ఊరేగింపులో మంటలు ఊదుతున్న యువకుడు

జంగారెడ్డిగూడెంలో స్వచ్ఛతా హీ సేవ

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో శుభ్రత, పరిశుభ్రత అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణం వల్లే వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ఇంట్లో వారితో పాటు, చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లాప్ ప్రోగ్రాం గురించి వివరించారు. ముఖ్యంగా తడి చెత్త, పొడిచెత్త వేరుచేయడం, హానికర చెత్త తదితర అంశాలను తెలియజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, శానిటరీ, పర్యావరణ కార్యదర్శులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

కుక్కునూరు: కుల వ్యవస్థ నిర్మూలనకు మహాత్మ జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, కబీర్‌దాస్, పెరియర్ రామస్వామి లాంటి మహనీయులు పోరాడారని వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ సంఘం 150 ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం ఉప్పేరు గ్రామంలో మండల కార్యదర్శి మడకం మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గౌస్ మాట్లాడారు. కుల వ్యవస్థ నిర్మూలనకు ఆనాటి నాయకులు కృషి చేస్తే నేటి పాలకులు కులాలను, మతాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. రాజకీయ స్వార్థంతో పాలకులు చేసే కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బి.సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శి కొండా ప్రసాద్, ఎం.మంగరాజు, రాజు, దుర్గారావు, జయరాం పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందిన విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి సదుపాయాలకు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

టి.నరసాపురం: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టి.నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం డీటీకి వినతిపత్రాన్ని అందజేశారు.

చింతలపూడి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ నారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణలో కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కృష్ణ జ్యోతికి వినతిపత్రం అందచేశారు.

బుట్టాయగూడెం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ నాయకురాలు ఎం.నాగమణి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచి అంగన్‌వాడీలను ఆదుకోవాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

చింతలపూడి: చింతలపూడి మండలం, రేచర్ల గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లకు వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు టి వెంకట్రామిరెడ్డి విద్యుత్ శాఖ అధికారులకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మించి ఏడాది దాటిపోయినా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీటితో పాటు గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌కు కూడా విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణం స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటలు బట్టబయలు

టీడీపీ నిరసన శిబిరంలో వెలుగులోకి వచ్చిన వర్గ విభేదాలు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కొయ్యలగూడెంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి టీడీపీ నిరసన శిబిరం అందుకు వేదికగా నిలిచింది. మంగళవారం శిబిరంలో రెండు వర్గాల నాయకులు తోపులాటలకు దిగారు. టీడీపీ పోలవరం నియోజకవర్గ పోరులో ప్రస్తుత ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌ల మధ్య అసెంబ్లీ టికెట్ కోసం అంతర్యుద్ధం జరుగుతున్న విషయం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో టి.నర్సాపురం మండలానికి చెందిన నేత ఒకరు మంగళవారం శిబిరంలో తన అనుయాయులతో కలిసి కూర్చోగా.. నియోజకవర్గ కీలక నేత తోసివేయడం ఘర్షణకు కారణమైంది. నిరసన వేదిక ప్రారంభం నాటి నుంచి మొడియం శ్రీనివాస్ వర్గీయులను నిర్లక్ష్యం చేస్తూ తనకు అనుకూలంగా ఉన్నవాళ్లను మాత్రమే కూర్చోబెట్టి పార్టీ హైకమాండ్ దృష్టిలో పడేవిధంగా పబ్లిసిటీ చేస్తూ ప్రచారం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే వర్గీయులు ఇన్‌చార్జి వర్గీయులపై ఘర్షణకు దిగారు. ఇటీవల ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో కూడా తమ వర్గీయులను మాత్రమే ప్రాధాన్యతా వరుసలలో కూర్చోబెట్టి మాజీ ఎమ్మెల్యే వర్గీయులకు సముచిత స్థానం ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శిబిరం నిర్వహణకు అయ్యే ఖర్చులను తమపై భారీగా రుద్దుతూ ఫొటోలు, ప్రచారానికి మాత్రం పక్కన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలోని ఈ కుమ్ములాట అంశం నియోజకవర్గంతో పాటు జాతీయ ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు చర్చనీయాంశంగా మారింది.

గిరిజన ప్రాంత అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి



దొరమామిడిలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం



రామన్నపాలెంలో సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ రమేష్

- ఎంపీపీ కారం శాంతి
- దొరమామిడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి అధిక నిధులు కేటాయిస్తున్నారని ఎంపీపీ కారం శాంతి అన్నారు. మండలంలోని దొరమామిడిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయం పరిధిలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందని చెప్పారు. అయితే ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గడపగడపకు నిధులు సరిపోవడంలేదని గిరిజన ప్రాంతానికి నిధులు పెంచి ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరవడం ఆయన వెంటనే అదనంగా మరో రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. మొత్తం రూ.40 లక్షలతో గిరిజన ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేస్తున్నారని తెలిపారు. రోడ్డు పనులలో లోపాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టరును ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాలింగి వెంకటేశ్వరరావు, కారం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మరలా వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

కామవరపుకోట: ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో, అభివృద్ధితో ప్రజలు మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైపే చూస్తున్నారని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్ అన్నారు. మండలంలో రామన్నపాలెం నుంచి ఉప్పలపాడు మీదుగా వెళ్ల రహదారికి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ కడిమి రమేష్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా, ప్రభుత్వం అర్హులైన ప్రతి వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజాదారణ పొందుతుందన్నారు. మరలా రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాయంకుల తులసి, ఉపసర్పంచ్ నార్ని సతీష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ కనికల్లా రత్నకుమారి, నాయకులు ఉప్పలపాటి శ్రీను, ఏసు పాదం, అన్నపనేని రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి స్వామి వారి 22వ వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధన, అంకురార్పణ, దీక్షాధారణ, పవిత్ర అధివాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ముఖ్య అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో పాంచరాత్రాగమ పండితులు కిళాంబి వేంకట పవన్ కృష్ణామాచార్యులు, యాజ్ఞిక బృందం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కిలారపు శ్రీనివాసరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



స్వామివారి ఉత్సవ మూర్తులతో అర్చక బృందం, ట్రస్టీలు, కార్యనిర్వహణాధికారి

30 నుంచి వైద్య శిబిరాలు

ఏలూరు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆరోగ్య పరిస్థితి తెలియజేయాలని ఏలూరు 29వ డివిజన్ ఇన్‌చార్జి సన్నీ చైతన్య కోరారు. ఏలూరు టైటస్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని తాపీమేస్త్రీ కాలనీలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ ఉచితంగా మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్యవంతమైన సమాజం కోసం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఇంటింటా సర్వే చేపట్టారని చెప్పారు. సర్వేలో కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తే, వాటికి అనుగుణంగా ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. కంటి, దంత సమస్యలు, షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, డెంగీ, మలేరియా పరీక్షలు, గర్భిణుల ఆరోగ్య సమస్యలు, వ్యాధి నిరోధక టీకాలు, దీర్ఘకాలిక వ్యాధులు ఇలా అనేక రకాల వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత, మలేరియా అధికారి గోవిందరావు, ఆరోగ్య కార్యకర్తలు సుహానా, వెంకటలక్ష్మి ఉన్నారు.

ములగలంపాడులో పేకాట శిబిరంపై దాడి

లింగపాలెం: ములగలంపాడు గ్రామంలో పేకాట శిబిరంపై మంగళవారం చింతలపూడి సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. చింతలపూడి ఎస్సై కె ప్రసాద్, ధర్మాజీగూడెం ఎస్సై పి చెన్నారావు సిబ్బందితో కలసి ములగలంపాడు శివారు మామిడితోటలో పేకాడుతున్న 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లు, రూ.7,200 నగదును స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు.

బొర్రంపాలెంలో చోరీ

టి.నరసాపురం: బొర్రంపాలెం గ్రామ దేవతల ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవార్ల మెడలోని 12 గ్రాముల మూడు బంగారు మంగళసూత్రాలు, హుండీలోని సుమారు రూ.2 వేలు నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పి.మల్లిబాబు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ఏలూరు టౌన్: ఏలూరు నగర పరిశుభ్రతకు నగరపాలక సంస్థ చేపట్టిన స్వచ్ఛత సేవ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ కోరారు. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమం చేపట్టారు. ఏలూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కార్పొరేషన్ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది, కార్మికులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలు రోడ్లపైనా, డ్రెయినేజీల్లోనూ ఇష్టారాజ్యంగా చెత్త, వ్యర్థాలు వేయకుండా, చెత్త సేకరణ వాహనాలకు అందించాలని కోరారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులు రోడ్లపై వ్యర్థాలు, చెత్త వేయరాదని, నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు పర్యావరణ కార్యదర్శులు, యువత, విద్యార్థులు హాజరయ్యారు.